హైదరాబాద్‌లో బీజేపీదే విజయం

బీజేపీ అభ్యర్థి మాధవీలత


బైక్‌ర్యాలీలో మాట్లాడుతున్న మాధవీలత


బీజేపీ అభ్యర్థి మాధవీలతను సన్మానిస్తున్న సోమరాజు సింగ్ తదితరులు


గోల్కొండ బంజారా దర్వాజ నుంచి బీజేపీ బైక్ ర్యాలీ

అబిడ్స్: హైదరాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవీలత పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు తనను ఆదరించారన్నారు. ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా ప్రతి ఒక్కరూ తనకు ఓటు వేసి గెలిపిస్తామని హామీ ఇచ్చారన్నారు. శనివారం ధూల్‌పేట నుంచి గోషామహల్ నియోజకవర్గం నలుమూలల పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లోధ్ కులస్తులు బీజేపీ నాయకుడు సోమరాజ్ సింగ్ ఆధ్వర్యంలో మాధవీలతను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..మజ్లిస్‌కు ఓటు వేస్తే అభివృద్ధి జరగదన్నారు. తనను గెలిపిస్తే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వంచే భారీ ఎత్తున నిధులు తీసుకొచ్చి హైదరాబాద్ అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లాల్‌సింగ్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బి.కృష్ణ, వి.గణేష్‌యాదవ్, ముక్క కృష్ణాగుప్తా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే పాతబస్తీ అభివృద్ధి..

జియాగూడ: బీజేపీతోనే పాతబస్తీ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ అభ్యర్థి మాధవీలత అన్నారు. శనివారం ప్రచార చివరి ఘట్టాన్ని పురస్కరించుకుని కార్వాన్ నియోజకవర్గంలో బైక్‌ర్యాలీకి ఆమె హాజరై ప్రసంగించారు. 40 ఏళ్లుగా పాతబస్తీ అభివృద్ధిలో కుంటుపడిందని బీజేపీ గెలుపుతోనే పాతబస్తీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కె.గోవర్ధన్, గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డిజ్‌వర్ సింగ్, పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేన్‌రెడ్డి, గోల్కొండ జిల్లా ఓబీసీ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింగ్‌రావు, గోల్కొండ జిల్లా బీజేపీ జాయింట్ కన్వీనర్ శివకుమార్ యాదవ్, సీనియర్ నాయకుడు జి.శివరత్నం, జియాగూడ అధ్యక్షుడు జె.లక్ష్మీనారాయణ, కార్వాన్ అధ్యక్షుడు దొర్నల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ..

గోల్కొండ: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవీలతకు మద్దతుగా టోలిచౌకీ బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి ఆధ్వర్యంలో గోల్కొండ బంజారా దర్వాజ నుంచి కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయం వరకు జరిగిన ర్యాలీలో సురేష్‌చారి, వినేష్ సింగ్ తదితరులున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

చార్మినార్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోలింగ్ రోజు అంటే ఈనెల 13న క్షేత్రస్థాయిలోని పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని పోలీసులతో పాటు కర్ణాటక నుంచి వచ్చిన హోంగార్డులు, ప్రత్యేక పోలీసు అధికారులు, టీఎస్‌నాబ్, టీఎస్ఐసీసీసీ, ట్రాఫిక్, ఉమెన్ సేఫ్టీ వింగ్, సీసీఎస్ అధికారులతో పేట్లబురుజులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌తో పాటు గోషామహల్ పోలీసు స్టేడియంలో శనివారం ఆయన వేర్వేరుగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించి డ్యూటీలోని పోలీసులు చేయాల్సిన పనులు, అనుసరించాల్సిన ముఖ్యమైన అంశాలను వివరించారు. పోలీసు విభాగాలను చెందిన దాదాపు 8 వేల మంది పోలీసులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోలీసులకు నగర కొత్వాల్ సూచించిన అంశాలు..

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లో ఎన్నికల నిబంధనలు బేఖాతరు కాకుండా సంబంధిత డ్యూటీ పోలీసులు చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. పోలింగ్ ముగిసేంతర వరకు తనఖీలు ముమ్మరంగా కొనసాగాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద 100 మీటర్లు, 200 మీటర్ల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇక ఈవీఎంల భద్రత ఎంతో ముఖ్యమన్నారు. ప్రజా రవాణా, ప్రైవేట్ రవాణా వ్యవస్థలు దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. పోలింగ్ రోజు సాయంత్రం 6 గంటల వరకు కూడా ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాల వద్దకు వస్తే.. సంబంధిత ప్రిసైడింగ్ అధికారి సూచనల మేరకు డ్యూటీలోని పోలీసులు వ్యవహరించాలన్నారు. డ్యూటీలోని పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. సెల్‌ఫోన్‌లను పోలీసులు తమ కస్టడిలోకి తీసుకోకుండా కౌంటర్‌లలో జమ చేయించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డులతో కలిగి ఉన్న బీఎల్‌ఓలను పోలింగ్ స్టేషన్లలోనికి అనుమతించాలన్నారు. అక్రమ మద్యం, నగదు, ఉచితంగా పంపిణీ చేయడానికి వినియోగించే వస్తువులను డ్యూటీ అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తమిళిసైని కలిసిన బీజేపీ నేతలు



గోల్కొండ: తెలంగాణలో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకొని సత్తాచాటుతుందని తెలంగాణ రాష్ట్ర మాజీ గవర్నర్, తమిళనాడు బీజేపీ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ అన్నారు. గుడిమల్కాపూర్‌కు చెందిన బీజేపీ నాయకులు ప్రభుపూజారి ఆధ్వర్యంలో శనివారం ఆమెను కలిశారు.

'రాహుల్ ప్రధాని అయితేనే భారత్ అభివృద్ధి'


ప్రచారానికి వెళ్లిన నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: ప్రధాని రాహుల్ గాంధీ అయితే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తుందని కాంగ్రెస్ ఆల్ ఇండియా ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్, ఉత్తర ప్రదేశ్ ఓబీసీ సెల్ ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌తోనే పేద బడుగు వర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన నిర్మల్‌కుమార్ యాదవ్ ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలిలో ఎన్నికల ప్రచారం కోసం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాహుల్‌గాంధీని అధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం


కాట్రగడ్డ ప్రసూన

అబిడ్స్: ప్రధానమంత్రి మోదీతోనే దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ సెటిలర్ ఫోరం కన్వీనర్ కాట్రగడ్డ ప్రసూన పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ..హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థులు మాధవీలత, కిషన్‌రెడ్డిను రెండు నియోజకవర్గాల్లో ఉన్న లక్షలాది మంది సెటిలర్లు అంతా ఓటు వేసి గెలిపించాలన్నారు. బీజేపీ హయాంలోనే సెటిలర్లకు ఎంతో న్యాయం జరిగిందన్నారు. మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆమె పిలుపునిచ్చారు. ఈనెల 13న ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేసి దేశంలో 400 ఎంపీ సీట్లు వచ్చే విధంగా కృషి చేయాలని ప్రసన్న పేర్కొన్నారు.

హఫీజ్‌బాబానగర్‌లో కార్డన్ సెర్చ్



సంతోష్‌నగర్: కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్ సీ–బ్లాక్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. దాదాపు 110 మంది పోలీసులు పాల్గొని ప్రతి ప్రాంతాలను జల్లెడ పట్టారు. సరైన పత్రాలు లేని 35 ద్విచక్ర వాహనాలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సౌత్, ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ స్వామి మాట్లాడుతూ..ఎన్నికలను పురస్కరించుకొని స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. రౌడీషీటర్లు పోలీసులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసీపీ మనోజ్ కుమార్, కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి, ఎస్సైలు లింగరాజు, హేమ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

యాకుత్‌పురా: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఏక్తా జనశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం దారుషిఫాలోని పలు ప్రాంతాల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.రాజేష్ యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల రోజు ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసి 100 శాతం పోలింగ్ నమోదుకు సహకరించాలన్నారు. ఐదేళ్లకు ఒక్కసారి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు నిస్వార్థంతో సేలందించే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మహేందర్, నీలమ్మ, నరేష్, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న రాజేష్‌యాదవ్, ఫౌండేషన్ సభ్యులు

మజ్లిస్ విజయాన్ని ఎవరూ ఆపలేరు


టోలిచౌకీ యూసుఫ్ టెక్డీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్


ప్రచారం చేస్తున్న బిహార్ రాష్ట్ర మజ్లిస్ నాయకుడు అక్తర్ ఉల్ ఇమామ్

గోల్కొండ: ప్రధాని మోదీతో సహా కేంద్ర మంత్రి వర్గం మొత్తం వచ్చినా మజ్లిస్ విజయాన్ని అడ్డుకోలేరని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం టోలిచౌకీ యూసుఫ్ టెక్డీలో మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ పార్లమెంట్ మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ మచ్చలేని రాజకీయ నాయకుడని అన్ని వర్గాల ప్రజల మద్దతు ఆయనకు ఉందన్నారు. అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, వజీఉజ్‌జమాసిద్ధిఖి, బిహార్ రాష్ట్రంలోని ఇషన్ గంజ్ ఎంపీ అభ్యర్థి ఏ ఇమామ్, మజ్లిస్ ఉత్తరప్రదేశ్ అధ్యక్షుడు షౌకత్‌అలీ, ఏకే పటాన్ తదితరులున్నారు.

గోల్కొండలో..

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం మజ్లిస్ సిట్టింగ్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా శనివారం గోల్కొండలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్లిస్ బిహార్ రాష్ట్ర నాయకుడు అక్తర్ ఉల్ ఇమామ్ ఇంటింటింకీ తిరుగుతూ మజ్లిస్ పార్టీకి ఓటు వేసి అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలని కోరారు.

దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి


నాంపల్లిలో జరిగిన బైక్ ర్యాలీలో మహ్మద్ ఫిరోజ్ ఖాన్

నాంపల్లి: సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఫిరోజ్ ఖాన్ ఓటర్లను అభ్యర్థించారు. దానం నాగేందర్‌కు మద్దతుగా నాంపల్లి నియోజకవర్గంలో ఫిరోజ్ ఖాన్ నేతృత్వంలో శనివారం బైక్ ర్యాలీ జరిగింది. రెడ్‌హిల్స్ డివిజన్‌లోని జంగంబస్తీలో ప్రారంభమైన బైక్ ర్యాలీ అహ్మద్‌నగర్ డివిజన్‌లో ముగిసింది. కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్ ఖాన్ పేర్కొన్నారు.

దళితులు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలి..


మాట్లాడుతున్న మిత్రకృష్ణ

జియాగూడ: దళితులు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి 17 లోక్‌సభ స్థానాల్లో భారీ విజయాన్ని అందించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మిత్రకృష్ణ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. దేశంలో మతతత్వ పార్టీలు గెలిచినట్లయితే భారత రాజ్యాంగం, లౌకికవాదం క్లిష్ట పరిస్థితుల్లో ఉంటుందన్నారు. తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ మాదిగల రిజర్వేషన్ వర్గీకరణ చేపడుతామని కమిటీ వేస్తున్నామని నేటికి కాలయాపన చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ రాజ్యం, ఇంటింటికీ సౌభాగ్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో అన్నివర్గాల ప్రజలు సామాజిక, ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- డీఆర్‌సీలో మార్గదర్శకాలపై సిబ్బందికి అవగాహన
- నేడు డీఆర్‌సీ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ

నాంపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ సిబ్బందికి అవసరమైన పోలింగ్ సామగ్రిని అందజేయడానికి సిద్ధం చేశారు. ఆదివారం ఉదయాన్నే ఎన్నికల సిబ్బంది డీఆర్‌సీ సెంటర్‌లో అందుబాటులో ఉండాలని ఇప్పటికే అధికారులు ఆదేశించారు. ఈ మేరకు శనివారం మాసబ్‌ట్యాంక్ ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నాంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ డీఆర్‌సీ సెంటర్‌లో పోలింగ్ విధులకు హాజరయ్యే సిబ్బందికి కొన్ని మార్గదర్శకాలను చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది చేయాల్సిన, చేయకూడని పనులపై అవగాహన కల్పించారు. నాంపల్లి నియోజకవర్గంలో మొత్తం 106 లోకేషన్స్(భవనాలు)లో 277 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 28 రూట్లలో వెళ్లేందుకు 58 బస్సులను అందుబాటులో ఉంచారు. రెండు బస్సులను రిజర్వులో ఉంటాయి. ఎన్నికల సిబ్బందితో పాటుగా 120 మంది వలంటీర్లు పనిచేస్తారు. వయోధికులు, దివ్యాంగుల కోసం 122 వీల్‌చైర్స్ అందుబాటులో ఉంటాయి.


ఎన్నికల నిర్వహణ కోసం హాకీ గ్రౌండ్‌లో సిద్ధం చేసిన వాహనాలు



బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ సస్యశ్యామలం

మాజీ హోంమంత్రి మహమూద్ అలీ


ప్రచారం చేస్తున్న మహమూద్ అలీ, ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఆనంద్‌కుమార్ గౌడ్


జాంబాగ్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండేదని మాజీ హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. దేశంలోనే తెలంగాణను కేసీఆర్ అగ్రగామిగా తీర్చిదిద్దారన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు రోజు నాంపల్లి నియోజకవర్గం నలుమూలల ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు, నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఆయన పర్యటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలల కాలంలోనే ప్రజలు నరకయాతన చూస్తున్నారన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

మజ్లిస్, బీజేపీ అసత్య ప్రచారాలు నమ్మకండి...

మజ్లిస్, బీజేపీల తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని హైదరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. శనివారం గోషామహల్ నియోజకవర్గంలో జాంబాగ్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రచారం చేశారు. అనంతరం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..మజ్లిస్, బీజేపీలు మతాల పేరు చెప్పి ఓట్లు దండుకుంటున్నాయన్నా.. బీఆర్ఎస్ మాత్రం పదేళ్లల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ధన్‌రాజ్, నరేందర్ యాదవ్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట


చార్మినార్-గుల్జార్‌హౌజ్ వద్ద..

చార్మినార్: విద్యార్థులకు సెలవులతో పాటు వీకెండైన శనివారం పాతబస్తీ చార్మినార్ పరిసరాలు సందర్శకులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చార్మినార్ కట్టడంతో పాటు మక్కా మసీదు, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, జూపార్కు తదితర పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో కళకళలాడాయి. చార్మినార్ కట్టడం వద్ద రోజంతా పర్యాటకుల సందడి కనిపించింది. ఎండను సైతం లెక్క చేయని సందర్శకులు అధిక సంఖ్యలో పాతబస్తీలోని పర్యాటక స్థలాలను సందర్శించారు. పర్యాటకుల సంఖ్య పెరగడంతో చిరు వ్యాపారాలు కూడా జోరుగా కొనసాగాయి.

బంధువును గంజాయి కేసులో ఇరికించే యత్నం

ముగ్గురి రిమాండ్

గోల్కొండ: పాత కక్షల నేపథ్యంలో తన బంధువును గంజాయి కేసులో ఇరికించేందుకు చేసిన ప్రయత్నం బెరిసికొట్టింది. చివరకు వీరు పోలీసులకు చిక్కారు. గోల్కొండ పోలీసుల వివరాల ప్రకారం..ఖాజీగల్లికి చెందిన ఇమ్రాన్ ఆలీఖాన్ అలియాస్ లడ్డూ రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఇమ్రాన్ ఆలీఖాన్‌కు వరుసకు సోదరుడైన మోయిజ్ ఆలీఖాన్‌తో పాత కక్షలు ఉన్నాయి. గత వారం ఇమ్రాన్ ఆలీఖాన్ కారులో మోయిజ్ ఆలీఖాన్ రెండున్నర కిలోల గంజాయిని పెట్టాడు. టీసీఎస్ పోలీసులకు ఇమ్రాన్ ఆలీఖాన్ కారులో గంజాయి రవాణా అవుతుందని సమాచారం అందించాడు. నాలుగు రోజుల క్రితం టీసీఎస్ పోలీసులు ఇమ్రాన్ ఆలీఖాన్ కారును తనిఖీ చేసి అందులోంచి రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అయితే గంజాయితో తనకు సంబంధం లేదని పోలీసులకు ఇమ్రాన్ ఆలీఖాన్ తెలిపాడు. కారు తిరిగిన ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలను సేకరించిన పోలీసులు ముగ్గురు యువకులు కారు ఆగి ఉన్న సమయంలో గంజాయి ప్యాకెట్లు పెట్టినట్లు తెలింది. దీంతో మోయిజ్ ఆలీఖాన్, మాజీద్, సలామ్ అనే యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించిన పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు.

'హైమాస్ట్ లైట్ల నిర్వహణ గాలికి'

గోల్కొండ: లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు అధికారుల నిర్లక్ష్యంతో పలు చోట్ల వెలగటం లేదు. టోలిచౌకీ చౌరస్తా, నానల్‌నగర్ క్రాస్ రోడ్స్, టూమ్స్ చౌరస్తాతో పాటు గుడిమల్కాపూర్, మెహిదీపట్నం తదితర చౌరస్తాలో హైమాస్ట్ లైట్లు అధికారులు గతంలో ఏర్పాటు చేశారు. అయితే ఈ విధంగా ఏర్పాటు చేసి హైమాస్ట్ లైట్లు సగానికి పైగా వెలగడమే లేదు. పాడైపోయిన లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం అధికారులు పూర్తిగా మార్చిపోయారు. దీంతో రాత్రుల్లో అటుగా వెళ్లే పాదచారులతోపాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాడైపోయిన హైమాస్ట్ లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డాక్టర్ భరణికి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్



సుల్తాన్‌బజార్: ఉస్మానియా మెడికల్ కళాశాలకు చెందిన రేడియాలజీ డయాగ్నొస్టిక్ డాక్టర్ భరణికి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ దక్కింది. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో పీజీ చదివిన డాక్టర్ భరణి నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్‌లో గత 2021 నుంచి ఏడాదికి రెండు మూడు సెషన్స్‌ను ఎగ్జామ్స్ రాసి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్‌ను సాధించారు. దీంతో డాక్టర్ భరణికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ చేతుల మీదుగా మెడల్‌ను అందుకున్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు

గౌలిపురా: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ డీసీ ఉమాపతిరావు 10 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..భవానీనగర్ తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన షేక్ షబ్బీర్ (49) భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు సహకరించకుండా విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకొని షేక్ షబ్బీర్‌పై ఈ–పెట్టీ కేసు నమోదు చేసుకొని నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచగా..పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడు ఉమర్‌కు 10 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.